క్లుప్తంగా

ఎద్దుల బండిని ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన నరసయ్య యాదవ్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నరసన్నపల్లె వద్ద గురువారం సాయంత్రం ఎద్దుల బండిని బైక్ ఢీ కొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న దేవరకొండ నరసయ్య యాదవ్(42) మృతి చెందాడు. నరసన్నపల్లెకు చెందిన సోమిరెడ్డిపల్లె నరసయ్య ఎద్దుల బండితో పొలం దగ్గరకు వెళుతుండగా వెనుక వైపున బండిని బైక్ ఢీకొంది. రోడ్డుపై పడిన నరసయ్య యాదవ్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

బద్వేలు అర్బన్ : ప్రస్తుత సీజన్‌లో ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉందని, దానిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ఎంపీడీఓ డి.మల్లేశ్వరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్, అధికారులు పాల్గొన్నారు.

పర్మిట్ రూములకు అనుమతులు తప్పనిసరి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణ నిర్వాహకులు తప్పకుండా పర్మిట్ రూములకు అనుమతి తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ సురేంద్ర రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 21 మద్యం దుకాణాలు ఉన్నట్లు సీఐ తెలిపారు. పర్మిట్ రూమ్ కోసం మున్సిపాలిటీ పరిధిలో రూ.7.50 లక్షలు, పంచాయతీ పరిధిలో రూ.5 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలని పేర్కొన్నారు. ముందుగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి పర్మిట్ రూమ్‌లకు రుసుం చెల్లించాలన్నారు. తర్వాత ఏడాది మొత్తానికి సంబంధించి ఒకే సారి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని సీఐ తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 18, రూరల్‌పరిధిలో 3 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. అలాగే పట్టణంలోని 8 బార్లకు త్వరలో టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఐదేళ్లు నిండిన పిల్లల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ పద్మలత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం 2009లోని 12(1)(సి) మేరకు ఒకటో తరగతిలో మిగిలిన 25 శాతం సీట్ల భర్తీ కోసం ఐదేళ్లు నిండిన పిల్లలకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, ఓసీ వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారి పిల్లలు ఇందుకు అర్హులని వివరించారు. జనన, కుల, ఆదాయ, నివాస సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు అవసరమైతే దివ్యాంగ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈనెల 20వ తేదీ లోపు creap gov in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీపీపీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న ఫ్లైయాష్ టిప్పర్
- ఇద్దరు మహిళలు దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి
- కన్నీరు మున్నీరుగా విలపించిన బంధువులు


మృతి చెందిన గాయత్రి, సుభాషిణి


గాయపడిన వెంకటేష్


ప్రమాదానికి కారణమైన ఫ్లైయాష్ టిప్పర్

జమ్మలమడుగు : మండల పరిధిలోని కలమల్ల గ్రామ సమీపంలో ఆర్టీపీపీ వద్ద బ్రిడ్జిపైన గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వచ్చిన ఫ్లైయాష్ టిప్పర్ ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభాషిణి(35), గాయత్రి(25) అనే ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వెంకటేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని కలమల్ల ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముద్దనూరు మండల పరిధిలోని కోసినేపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణయ్య ఆర్టీపీపీలోని లోకోషెడ్‌లో పని చేస్తుండగా, వెంకటేశు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ అన్నదమ్ములు. గురువారం వారి బంధువులకు సంబంధించిన వివాహానికి ప్రొద్దుటూరుకు బైక్‌లో బయలుదేరారు. బైక్‌ను వెంకటేష్ నడుపుతుండగా అతని భార్య గాయత్రి, వెంకటరమణయ్య భార్య సుభాషిణి వెనుక కూర్చున్నారు. వీరు ఆర్టీపీపీ నుంచి కలమల్ల మీదుగా బైక్‌లో బ్రిడ్జిపై వెళుతుండగా అధిక లోడుతో వస్తున్న ఫ్లైయాష్ టిప్పర్ వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న వెంకటేష్, గాయత్రి, సుభాషిణి కిందపడ్డారు. టిప్పర్ వేగంగా గాయత్రి, సుభాషిణిలపై దూసుకెళ్లింది. దీంతో వారిద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎంత సేపటికి 108 వాహనం రాకపోవడంతో సంఘటన స్థలానికి వచ్చిన కలమల్ల ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తన జీపులో తీవ్ర గాయాలైన వెంకటేష్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయత్రికి ఇద్దరు, సుభాషిణికి ఇద్దరు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పరిశీలించారు.

న్యాయం చేయాలంటూ ధర్నా..

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ స్థానికులు, కార్మికులు బ్రిడ్జిపైనే మృతదేహాలను పెట్టుకుని ధర్నా చేపట్టారు. ఫ్లైయాష్‌ను అధికంగా లోడు చేసుకుంటూ టిప్పర్లు, లారీలు మనుషులను తొక్కించుకుంటూ పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిప్పర్ల యజమానులేమో బూడిదలో ఆదాయం పొందుతుండగా జనం మాత్రం ఇలా మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


సంఘటన స్థలంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి


న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న స్థానికులు

వివాహ వేడుకలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ,


వధూవరులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అట్లూరు : మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం మల్లినేనిపట్నం కాలనీలో జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మల్లినేనిపట్నం కాలనీకి చెందిన మద్దెల నాగయ్య, గోపాలమ్మ కుమారుడు ఓబులేస్ వివాహ కార్యక్రమంలో ఆయన బుధవారం రాత్రి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలానే గురువారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని వధూవరులను దీవించారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, డీఎల్డీఏ జిల్లా చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పొన్నపోలు బ్రహ్మానందరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, బద్వేలు జెడ్పీటీసీ సభ్యుడు పోలిరెడ్డి, పాలకొండు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

కలసపాడు : మండలంలోని ముద్దంవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోడి పీరారెడ్డి, గోడి తులసమ్మల కుమారుడు ప్రతాప్‌రెడ్డి వివాహం గురువారం జరిగింది. ఈ వివాహానికి హాజరైన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయర్త కె.రమణారెడ్డి, అంకన గురివి రెడ్డి, మల్లారెడ్డి, పురుషోత్తం రెడ్డి, సాయినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌ను మరిపించేలా జెడ్పీటీసీ ఎన్నికలు

- స్థానికులు ఓటు వేయకుండా అడ్డుకున్న పచ్చమూకలు
- కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు
- సీసీ ఫుటేజీలు, వెబ్ కాస్టింగ్ వీడియోలు ఇస్తే నిరూపిస్తాం
- ఎస్ఈసీ, టీడీపీ, పోలీసుల కుమ్మక్కు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు బీహార్‌ను మరిపించేలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా ఎన్నికల్లో దౌర్జన్యాలు, అక్రమాలు జరిగితే బీహార్‌తో పోల్చేవారని, ఇకపై ఆంధ్రప్రదేశ్‌తో పోలుస్తారన్నారు. రాష్ట్రంలో పలు ఖాళీలు ఉన్నప్పటికీ ఒక పథకం ప్రకారం ఎంపిక చేసుకున్న కొన్ని స్థానాల్లోనే ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, పోలీసులు కూడబలుక్కుని నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ప్రతిపక్ష నేతలపై దాడులు నిర్వహించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కనంపల్లె సర్పంచ్ రామాంజులు ఇంటి వద్ద తుపాకీ ఉంచి బెదిరించారన్నారు. ఎలాంటి నేర చరిత్ర లేని వారిని బైండోవర్ చేశారన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ మూకలు ఓటర్ల స్లిప్పులు లాక్కొని పంపి వేశారని ఆరోపించారు. ఏజెంట్లను కూడా కొట్టి బయటికి పంపేశారన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, విజువల్స్ తమ వద్ద ఉన్నాయంటూ ఆయన ప్రదర్శించారు. సిద్దవటంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలో ఉండటం, కలెక్టర్ సమక్షంలోనే బయటి వ్యక్తులు దొంగ ఓట్లు వేస్తుండటం, కాల్చి వేస్తామంటూ డీఎస్పీ ఓటర్లను బెదిరించడం తదితర ఫొటోలను ఆయన మీడియా ఎదుట ప్రదర్శించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై ఇప్పటికి 39 పిటిషన్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ఇంత జరిగినా కలెక్టర్, ఎస్పీ, డీఐజీలు ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగాయని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. తాము గెలిచామంటూ టీడీపీ నేతలు విజయోత్సవాలు నిర్వహించుకోవడం విచారకరమన్నారు.

జ్యువెలరీ షోరూం ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మెయిన్ బజార్‌లో బుశెట్టి జ్యువెలర్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బుశెట్టి సిల్వర్ జ్యువెలరీ షోరూంను గురువారం ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు, శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ బుశెట్టి రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమాని బుశెట్టి తేజు మాట్లాడుతూ రాయలసీమలోనే ప్రప్రథమంగా నాణ్యమైన వెండి వస్తువులు పట్టణ ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు ఈ షోరూంను ప్రారంభించామని తెలిపారు. ఇటీవల కాలంలో బంగారం ధర విపరీతంగా పెరిగిపోతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజల కోసం తాము ఈ షోరూంను ప్రారంభించామన్నారు. తమ వద్ద వెండితో తయారు చేసిన గాజులు, వడ్డానం, లాంగ్ చైన్, కమ్మలు, ఉంగరాలు, డిన్నర్‌సెట్, బిందెలు, పిల్లలకు వాటర్ బాటిళ్లు, దేవుని ప్రతిమలు, అన్ని రకాల పూజా సామాగ్రి, అన్ని రకాల వస్తువులు అందుబాటు ధరలో లభిస్తాయన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా ఈనెల 31వ తేదీ వరకు కొనుగోలుపై 20 శాతం తగ్గింపు ధరలకు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షోరూం ప్రారంభోత్సవంలో పట్టణానికి చెందిన పుర ప్రముఖులు, వ్యాపారస్తులు, వైద్యులు, మహిళలు పాల్గొన్నారు.


బుశెట్టి సిల్వర్ జ్యువెలరీ షోరూంలో వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు

క్రీడా పాఠశాలకు 16 మంది ఎంపిక

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథ రెడ్డి తెలిపారు. గత నెలలో జిల్లా స్థాయిలో ఎంపికలు చేపట్టి రాష్ట్ర స్థాయి ఎంపికలకు జాబితాను పంపారు. రాష్ట్ర స్థాయిలో 16 మందిని ఎంపిక చేశారు.

భలే కేటుగాళ్లు..!

- సెల్ ఫోన్లు చోరీ చేసి బ్యాంకు ఖాతాల్లో నగదు హాంఫట్
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 46 సెల్‌ఫోన్లు, రూ.2.8లక్షలు స్వాధీనం
- నిందితులు హైదరాబాద్, అన్నమయ్య జిల్లా, నెల్లూరు వాసులు

తిరుపతి క్రైమ్ : సెల్ ఫోన్లు చోరీ చేసి ఆ సెల్ ఫోన్ ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాలోని నగదు హాంఫట్ చేస్తున్న కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఈస్ట్ పోలీస్ స్టేషన్ విలేకరులకు తెలిపిన వివరాలు..హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ, అన్నమయ్య జిల్లాకు చెందిన అశోక్, నెల్లూరు జిల్లాకు చెందిన గడ్డం కసిరెడ్డి ఓ ముఠాగా ఏర్పడి నగరంలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడేవారు. అలా చోరీ చేసిన మొబైల్ ఫోన్లలో ఆ వ్యక్తుల ఫోన్ పే, గూగుల్ పేను పరిశీలించి అందులో నగదును సరికొత్త ఎత్తుగడలతో కొట్టేసేవారు. ఏటీఎం సెంటర్ వద్ద కాపు కాసి, అక్కడకు వచ్చే వారికి తమ వారు హాస్పిటల్లో ఉన్నారని, డబ్బులు చాలా అవసరమని ఫోన్ పే చేస్తామని, కావాలంటే కమీషన్ కూడా ఇస్తామని వారిని నమ్మిస్తారు. ఇలా కహానీలు చెప్పి వీరంతా 49 సెల్ ఫోన్లు దొంగతనం చేసి 3.6 లక్షలు కాజేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హరికృష్ణ నుంచి రూ.లక్ష, 40 సెల్ ఫోన్లు, అశోక్ నుంచి రూ.90 వేలు, 6 సెల్ ఫోన్లు, కసిరెడ్డి నుంచి రూ.90 వేలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది కృషి చేశారని డీఎస్పీ వారిని అభినందించారు.

ఆరుతడి పంటల రైతుల్లో అలజడి

- జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు
- ఉరకలెత్తుతున్న కుందూ, పెన్నా నదులు




చాపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

కడప అగ్రికల్చర్ : జిల్లాలో గత వారం రోజులకుపైగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో అలజడి నెలకొంది. అల్పపీడనం కారణంగా ఎక్కడపడితే అక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆరుతడి పంటల రైతుల్లో ఆందోళన మొదలైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ముందుగా సాగు చేసిన ఆరుతడి పంటలకు కొన్నింటికి మేలు జరిగినా మరి కొన్ని చోట్ల మాత్రం ఇబ్బందికరమే. దీంతోపాటు ఆలస్యంగా సాగు చేసిన ఆరుతడి పంటల రైతులకు మాత్రం గుండెల్లో గుబులు పట్టుకుంది. ముఖ్యంగా ఉల్లి, మినుము, జొన్న ఇలాంటి పంటలు సాగు చేసిన రైతులకు మాత్రం ఆందోళన తప్పడం లేదు. కొన్ని చోట్ల ఉల్లి పంట రెండు నెలల దశలో కూడా ఉంది. ఇప్పుడిప్పుడే గడ్డలు ఏర్పడే దశ కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షానికి పొలాల్లో వర్షపు నీరు నిలిస్తే ఎర్రగడ్డలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వేలకు వేలు ఖర్చు పెట్టి సాగుచేసిన పంట మరో నెల రోజుల్లో చేతికొచ్చే సమయంలో ఇలాంటి ఎడతెరిపి లేని వర్షాలతో పంటనష్టం జరిగే అవకాశం ఉంది. ఈ వర్షాలు ఇలాగే మరో నాలుగు రోజులు కొనసాగితే మాత్రం ఎర్రగడ్డ రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం అధికంగా ఉంది. దీంతోపాటు ఉద్యాన పంటలైన పూల రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో పూలు నాణ్యత తగ్గుతున్నాయని రైతన్నలు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పత్తి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలకు తెగుళ్ల బెడద పెరుగుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా పెన్నా, కుందూ నదులు..

వరుసగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పెన్నా, కుందూ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాపాడు మండలం అల్లాడుపల్లె దేవళాల వద్ద కుందూనది, చెన్నూరు, సిద్దవటం వద్ద పెన్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

జిల్లాలో సాగులో ఉన్న ఆరుతడి పంటల వివరాలు...	
పంట	సాగు (హెక్టార్లలో)
మొక్కజొన్న	1772
సజ్జ	710
జొన్న	48
కంది	285
మినుము	1502
వేరుశనగ	983.38
పొద్దుతిరుగుడు	225
ఆముదం	23.2
పత్తి	3524.27

పులివెందులలో అత్యధికంగా...


గురువారం తెల్లవారుజాము నుంచి పులివెందులలో అత్యధికంగా 9.6 ఎంఎం వర్షం కురిసింది. అలాగే వేములలో 9 ఎంఎం, ఖాజీపేటలో 6.8 ఎంఎం, సీకేదిన్నెలో 6.4 ఎంఎం, చక్రాయపేటలో 5.8 ఎంఎం, సింహాద్రిపురంలో 5.6 ఎంఎం, కడప, చెన్నూరులలో 5.2, తొండూరు, పెండ్లిమర్రిలో 4.6, రాజుపాలెం, దువ్వూరు, వల్లూరులలో 4.2, వేముల, మైదుకూరు, జమ్మలమడుగు, వేంపల్లిలో 4, కొండాపురంలో 3.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సిద్దవటంలో 3 మిల్లీమీటర్లు, ప్రొద్దుటూరులో 2.6, బద్వేల్‌లో 2.4, చాపాడు, బి.మఠంలలో 2.2, కలసపాడులో 1.8, గోపవరం, అట్లూరు, ముద్దనూరులలో 1.2 మి.మీ. వర్షం కురిసింది.

లక్ష్మీపేటలో ముందస్తు స్వాతంత్య్ర వేడుకలు


లక్ష్మీపేటలో విద్యార్థికి నగదు అందజేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఒక రోజు ముందుగానే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలలో ప్రథమ స్థానంలో నిలిచిన వీర మమత అనే విద్యార్థినికి రిటైర్డు ఉపాధ్యాయుడు చిత్రాల శ్రీనివాసులు, గతంలో సోషల్ టీచర్‌గా పని చేసిన విజయ నగదు బహుమతి, మెమోంటో అందజేశారు. ఇదే పాఠశాలలోని విద్యార్థులకు స్వాతంత్య్ర సమరయోధులు, జాతీయ సమైక్యత అనే అంశంపై వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

జాతీయ జెండాలు పంపిణీ



ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం గ్రామంలో ప్రభుత్వ పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ హైస్కూల్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులతో కలసి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ డాక్టర్ జీవన, భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుధారాణి, జహంగీర్, రమణారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు అప్రజాస్వామికం


ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : టీడీపీ నాయకులు జెడ్పీటీసీ ఎన్నికల్లో అప్రజాస్వామికంగా గెలుపొందారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ ప్రకాశం, ఎన్టీఆర్, నెల్లూరు, కర్నూలు, బాపట్ల, వైఎస్సార్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, శ్రీనివాసయాదవ్, వంశీకృష్ణ, రాఘవేంద్రనాయుడు, గవిని శ్రీనివాసయాదవ్, శివరాం యాదవ్, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి కాటసాని నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో గురువారం జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో టీడీపీ గూండాల దాడిలో గాయపడిన ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్‌యాదవ్‌ను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడి చేసి గాయపర్చడం దారుణమన్నారు. పోలీసులు అధికారపార్టీకి వత్తాసు పలుకుతూ ప్రజలను ఓటు వేయనీకుండా చేయడం హేయమైన చర్య అన్నారు. గురువారం వెలువడిన జెడ్పీటీసీ ఫలితాలే టీడీపీ వారు ఎంత దుర్మార్గంగా వ్యవహరించి రిగ్గింగ్ చేసి గెలుపొందారో దీనికి నిదర్శనమన్నారు. తెలుగు దేశం పార్టీకి బీసీలే వెన్నముక అని చెబుతూ బీసీలపైనే దాడికి పాల్పడుతోందన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై బీటెక్ రవి వర్గీయులు దాడికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

నియంత పాలనలో ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ


పీపీ రాఘవరెడ్డి

ఖాజీపేట : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్యంలో జరిగిన ఎన్నికలు కావు కేవలం నియంతల పాలనలో జరిగిన ఎన్నికలు.. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యంకు మాయని వచ్చ అని వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ పీపీ రాఘవరెడ్డి అన్నారు. ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు లేకుండా ఓటర్లను పాల్గొనీయకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. ఇలాంటి ఎన్నికలు జరిపి ప్రజలకు టీడీపీ ప్రభుత్వం ఎలాంటి సంకేతాలు ఇస్తోందని ఆయన అన్నారు. రాబోవు స్థానిక ఎన్నికలు మేం ఇలాగే జరుపుతాం అని మీరు చెబుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. నియంత పోకడలు సాగించే పార్టీకి తగిన గుణపాఠం ప్రజలు చెబుతారని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజం అన్నారు. కానీ ఎన్నికలు ఎంత ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగాయన్నది ప్రజలు గమనిస్తారని అన్నారు. రాబోవు కాలం ప్రజా సునామి వస్తుందని, అందులో కూటమి ప్రభుత్వం భస్మం కాక తప్పదని అన్నారు.

బోధన సాగదు.. వేదన తీరదు

- పేస్ అకాడమీ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- రెండుగా చీలిన కళాశాల డైరెక్టర్‌లు
- తరగతులు నిర్వహించక విద్యార్థులకు ఇబ్బందులు



కళాశాల వద్ద బైఠాయించిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజా సంఘాల ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని ఓ కళాశాలలో 4, 5 రోజులుగా తరగతులు నిర్వహించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాల వద్ద గురువారం ఆందోళనకు దిగారు. స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డులోని పేస్ అకాడమీని గత ఏడాది 7 మంది డైరెక్టర్లతో ఏర్పాటు చేశారు. ఐఐటీ, నీట్, జేఈఈలో మంచి శిక్షణ ఇస్తామని ప్రచారం చేయడంతో ఫీజులు అధికంగా ఉన్నా కూడా తమ పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు కళాశాలలో చేర్పించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి టాప్ మైండ్ జూనియర్ కళాశాల పేరుతో తరగతులు నిర్వహిస్తున్నారు. పేస్ అకాడమీ పేరుతో ఐఐటీ, జేఈఈ, నీట్ శిక్షణ కూడా ఇస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో కళాశాల డైరెక్టర్ల మధ్య విభేదాలు రావడంతో కళాశాల యాజమాన్యం రెండుగా చీలిపోయింది. కొందరు డైరెక్టర్లు పేస్ అకాడమీని, కొందరు అధ్యాపకులను, ఫర్నీచర్, ఇతర సామగ్రిని మరొకచోటికి తరలించారు. దీంతో తల్లిదండ్రుల ఆందోళన చేయడంతో కళాశాలలోని లోపాలు, లొసుగులు బయటపడ్డాయి. టాప్‌మైండ్ కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఉన్నా ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇచ్చే అధ్యాపకులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క పేస్ అకాడమీ కొంత మంది డైరెక్టర్లు ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తామని పిల్లలను తమ వద్దకు పంపాలని కోరుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు

పేస్ అకాడమీకి ఇంటర్మీయట్ బోర్డు అనుమతి లేకపోవడంతో విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇంటర్‌తో పాటు ఇతర ప్రవేశ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మొత్తంలో ఫీజులు చెల్లించి తమ పిల్లలను పేస్ అకాడమిలో చేర్పించామని ఈ విద్యా సంవత్సరం వరకు డైరెక్టర్లు కలిసి ఉండి తమ విద్యా బోధన చేసి తమ పిల్లలకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. డైరెక్టర్లు డాక్టర్ జిలానీ, డాక్టర్ శంకర్ రెడ్డి మధ్య వచ్చిన విభేదాలే సమస్యకు కారణమని తల్లిదండ్రులు అంటున్నారు. తల్లిదండ్రులు చేపట్టిన ఆందోళనకు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, పీడీఎస్‌యూ నాయకుడు ఓబులేసు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు పీటర్ మద్దతు తెలిపి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ కళాశాల నిర్వాహకులు గత ఆర్ఐఓకు భారీగా ముడుపులు చెల్లించడంతో కళాశాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇంటర్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వల్ల విద్యార్థుల భవిష్యత్‌కు ఇబ్బందిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల నిర్వాహకులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టుటౌన్ ఎస్ఐ ధనుంజయ కళాశాల యాజమాన్యంతో చర్చించి సెలవుల తరువాత సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

అభివృద్ధి పనుల సమాచారం కౌన్సిలర్లకు లేకుంటే ఎలా?

- అధికారుల తీరుపై ఎమ్మెల్యే డాక్టర్ సుధ అసహనం
- వైస్ చైర్మన్ గోపాలస్వామిపై కమిషనర్ దిగజారి వ్యాఖ్యలు
- కమిషనర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే, చైర్మన్‌తో పాటు సభ్యుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో గల ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తోందని మున్సిపల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నేటికీ ఆ సమస్యను పరిష్కరించకపోవడంలో ఆంతర్యమేమిటని, ప్రజాప్రతినిధుల ఆదేశాలే పాటించకుంటే ఎలా అని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మున్సిపల్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామిని ఉద్దేశించి మీడియాలో ఫోకస్ అయ్యేందుకు ఏది పడితే అది మాట్లాడితే ఎలా అని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి అగౌరవంగా మాట్లాడటంతో ఎమ్మెల్యే డాక్టర్ సుధతో పాటు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి కమిషనర్ వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో గురువారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఏవైనా అభివృద్ధి పనులు చేసేటప్పుడు చైర్మన్, వైస్‌చైర్మన్లతో పాటు సంబంధిత కౌన్సిలర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిన కనీస బాధ్యత అధికారులకు ఉందనే విషయాన్ని మరిచిపోకూడదని సూచించారు. 15వ వార్డులో సచివాలయానికి వెళ్లే దారి కూడా సక్రమంగా లేదని, దీనిపై దృష్టి సారించాలని అధికారులను కోరారు.

కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలి

మున్సిపాలిటీ పరిధిలో జరిగే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో పనులు దక్కించుకుని సకాలంలో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి సూచించారు. గడిచిన ఏడాది కాలంలో వివిధ అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తున్నారే తప్ప పనులు ప్రారంభం కావడం లేదని, అటువంటి టెండర్లు రద్దు చేసి తిరిగి టెండర్లు నిర్వహించాలని కోరారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను మున్సిపల్ వైస్ చైర్మన్లతో పాటు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక కమలమ్మ కాలనీలో జనావాసాలు లేనిచోట సీసీ రోడ్డు నిర్మించారని, ఇది ఎవరికి ఉపయోగమని మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి సమావేశం దృష్టికి తీసుకురాగా అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి రావడంతో రోడ్డును నిర్మించామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అయితే ఎవరి లబ్ధి కోసమో జనావాసాలు ఉన్న చోట వదిలేసి లేనిచోట రోడ్డు ఏర్పాటు చేయడం తగదని మున్సిపల్ వైస్ చైర్మన్ తెలపడంతో మీడియాలో ఫోకస్ అయ్యేందుకు ఏది పడితే అది మాట్లాడితే ఎలా అని అగౌరవంగా మాట్లాడటంతో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, మరో మున్సిపల్ వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు కమిషనర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పాలకవర్గం గడువు మరో ఐదారు నెలల్లో పూర్తి కావస్తోందని, ఈ లోపు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ సమావేశం దృష్టికి తీసుకురాగా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ అధికారులు సమాధానమిచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, ఏఈ మహేష్, వివిధ శాఖల అధికారులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

చెక్కభజనకు ప్రాణం పోసిన కళాకారుడు సగిలి పుల్లయ్య

బద్వేలు అర్బన్ : గ్రామస్థాయి నుండి విదేశాల్లో కూడా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి చెక్కభజనకు ప్రాణం పోసిన కళాకారుడు సగిలిపుల్లయ్య అని ప్రముఖ కవి, గాయకుడు ఇరుపోతు శ్రీనివాసవర్మ, సంఘమిత్ర చైర్మన్ సొద్దల పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో నిర్వహించిన పుల్లయ్య సంస్మరణ సభలో వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో చెక్కభజన నేర్చుకుని దానినే ఊపిరిగా భావించి వేల ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు ఎంతో మంది శిష్యులను చెక్కభజన వైపునకు తీసుకువచ్చారని అన్నారు. అంతకుముందు పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవానందం, ఓబయ్య, గురుమూర్తి, పిచ్చయ్య, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, కేశవయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

8 సచివాలయాల్లో 154 పింఛన్ల కోత

చాపాడు : మండల పరిధిలోని 8గ్రామ సచివాలయాల పరిధిలో 154 మందికి చెందిన పింఛన్లను ప్రభుత్వం తొలగించింది. గత రెండు నెలల క్రితం దివ్యాంగ, పెరాలసిస్ పింఛన్ దారులకు ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. ఈ క్రమంలో గురువారం వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో తొలగించిన పింఛన్‌దారుల జాబితాలు వెలువడ్డాయి. మండలంలోని బద్రిపల్లె సచివాలయం పరిధిలో 30, సోమాపురం పరిధిలో 28, అయ్యవారిపల్లె పరిధిలో 8, ఎస్.ఓబాయపల్లె పరిధిలో 26, చాపాడు పరిధిలో 12, అన్నవరం పరిధిలో 14, పెద్దగురువళూరు పరిధిలో 4, చిన్నగురువళూరు గ్రామ సచివాలయం పరిధిలో 30 మంది పింఛన్లు తొలగిపోయినట్లు ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు తెలియజేశారు.

గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోండి

ప్రొద్దుటూరు రూరల్ : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా డబ్బులు జమ కాని రైతుల ఈనెల 20వ తేదీలోపు ఆయా రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలని ఏడీఏ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న చాలా మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడత కింద నిధులు బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. అయితే కొన్ని కారణాల వల్ల కొంత మంది రైతులకు డబ్బు జమ కాలేదని, వీరికి ప్రభుత్వం మళ్లీ గ్రీవెన్స్‌లో నమోదు చేసుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఈ పథకానికి ప్రస్తుత ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, రిటైర్డు అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ట్యాక్స్ చెల్లించిన వారు, పొలాలను ఇంటి పట్టాలుగా మార్చిన వారు, పొలాలను ఆక్వాకల్చర్‌గా మార్చిన వారు అనర్హులని వివరించారు. ఇలాంటి వారు గ్రీవెన్స్‌లో నమోదు చేయకూడదని సూచించారు. అర్హత ఉన్న రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.